సాక్షి వనపర్తి

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024

కొత్త వీసీకి సవాళ్లెన్నో?

పీయూలో తిష్టవేసిన అనేక సమస్యలు



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం

- కొత్తగా నిర్మించిన భవనాల్లో సిబ్బంది కొరత
- ప్రైవేట్ కళాశాలల్లో వసతులు, చదువులు నామమాత్రమే..
- పీయూ పరిధిలోని 102 కళాశాలల్లో 28 వేల మంది విద్యార్థులు
- హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించిన జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి నూతన వైస్ చాన్స్‌లర్‌గా జీఎన్ శ్రీనివాస్‌ను ప్రభుత్వం శనివారం నియమించగా.. ఆయన హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే యూనివర్సిటీలో తాండవిస్తున్న అనేక సమస్యలే ఆయనకు ప్రధానంగా స్వాగతం పలకనున్నాయి. కొత్తగా వచ్చే వైస్ చాన్స్‌లర్ విద్యార్థులు, సిబ్బంది, ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపిస్తారని ఆశిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి ఇవ్వని విధంగా రూ.100 కోట్లు కేటాయించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని విద్యార్థి సంఘాల నుంచి డిమాండ్ వినిపిస్తుంది. ముఖ్యంగా విద్యార్థులకు 16 కోర్సుల్లో రెగ్యులర్ కోర్సులు లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలకు చెల్లించే విధంగా ఫీజులు చెల్లించి కోర్సులు చదవాల్సిన పరిస్థితి నెలకొంది. వీటితోపాటు గతంలో రెగ్యులర్ కోర్సులు ఉన్నప్పటికీ వాటిని కూడా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చడంతో విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. అలాగే యూనివర్సిటీలో సీటు వచ్చిన విద్యార్థులు సుమారు రూ.8– 10 వేలు చెల్లిస్తేనే హాస్టల్‌లో సీటు వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మెస్ చార్జీలు ఆలస్యంగా చెల్లించడంతో విద్యార్థులకు భారంగా మారింది. పీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మొత్తం 102 ఉండగా అందులో 28 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

నామమాత్రంగా బోధనలు

పీయూ పరిధిలోని 59 డిగ్రీ, పీజీ కళాశాలలు, 25 బీఈడీ, ఫార్మ, బీపెడ్ వంటి కళాశాలలు ఉన్నాయి. వీటిలో నామమాత్రంగా వసతులు కల్పించడంతో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు, లైబ్రరీలు, తరగతులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బందిని కూడా నియమించకుండా అరకొరగా తరగతులు బోధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పీయూ అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు తాత్కాలిక ఏర్పాట్లతో మమ అనిపిస్తున్నారు. ఇందుకు పీయూ అధికారులు సైతం మద్దతుగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు కల్పించే వసతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పలు కళాశాలలకు గతంలో నోటీసులు ఇచ్చిన వారి వ్యవహార శైలిలో మార్పు రావడం లేదు.

బాధ్యతలు స్వీకరించిన వీసీ



కొత్త వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ వీసీ నదీమ్ అహ్మద్

పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా జీఎన్ శ్రీనివాస్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సెక్రెటరీయేట్‌లో పీయూ ఇన్‌చార్జ్ వీసీ నదీమ్ అహ్మద్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభం నుంచి..

పీయూ ప్రారంభం నుంచి వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 16 కోర్సులు ఉండగా రెండేళ్లకు కలిపి 1,600 మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. 1,350 మంది విద్యార్థులు పీయూలో ఉన్న మూడు హాస్టళ్లలో వసతి పొందుతున్నారు. ఇందులో బాలురకు రెండు హాస్టళ్లు ఉండగా.. బాలికలకు మాత్రం ఒకే హాస్టల్ ఉంది. ఇక నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించినా అడ్మిషన్లు ఇవ్వలేదు. అలాగే 24 గంటలు వైద్య సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక ఆస్పత్రి లేదు. చిన్నపాటి పీహెచ్‌సీ ఉన్న అందులో పూర్తిస్థాయిలో వైద్యులు లేరు. రాత్రిపూట విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఎస్వీఎస్ ఆస్పత్రికి వెళ్లేందుకు అంబులెన్స్ కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. ఇక గద్వాల, వనపర్తి, కొల్లాపూర్‌లోని పీజీ సెంటర్లలోనూ విద్యార్థులకు అకాడమిక్ భవనాలు, హాస్టళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. పీయూలో క్యాంటీన్ భవనం ఉన్నా అందుబాటులోకి రాలేదు. సింథటిక్ ట్రాక్ నిర్మించిన సిబ్బంది లేని కారణంగా నిరుపయోగంగా మారింది.

టీచింగ్, నాన్ టీచింగ్ సమస్యలు

పీయూలో మొత్తం 160 మంది నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో వీసీ రాజారత్నం హయాంలో సిబ్బందికి ప్రతి సంవత్సరం 12 శాతం వేతనాలు పెంచేలా నిర్ణయిస్తే.. దాన్ని గత వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ నిలిపివేశారు. దీంతో వారు నాలుగేళ్లుగా వేతనాల పెంపు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి కేవలం రూ.7,500 నుంచి రూ.18 వేల మధ్య వేతనాలు ఉన్నాయి. దీంతో చాలీచాలని జీతాలతో నెట్టుకువస్తున్నారు. వీరితో పాటు కాంట్రాక్టు అధ్యాపకులు సైతం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసిన విధంగా తమను కూడా పర్మినెంట్ చేయాలని పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

చలో నల్లమల



నల్లమలలోని టైగర్ సఫారీ వాహనం

రాష్ట్రంలో టూరిస్ట్ డెస్టినేషన్‌గా నల్లమల అడవులు

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో పర్యాటకులకు ప్రత్యేకంగా 'టైగర్ స్టే' ప్యాకేజీలు
- దట్టమైన అడవిలో ట్రెక్కింగ్, సఫారీ, వసతితో రోజంతా అడవిని ఆస్వాదించే వీలు
- వీకెండ్, సెలవు రోజుల్లో కృష్ణాతీరంలోని సోమశిలకు పెరుగుతున్న రద్దీ
- అడవి అందాలు, కృష్ణమ్మ సోయగాలను ఏకకాలంలో వీక్షించేలా అటవీ శాఖ ప్రణాళిక

టైగర్ స్టే ప్యాకేజీల వివరాలు

ఫర్హా ట్రీహౌస్ రూ.8,500	చెంచు హట్ రూ.7,500
చీతల్ అండ్ ఒట్టర్ రూ.6,500	జనరల్ ఏసీ రూం రూ.5,100



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సోమశిల ఎకో పార్క్

సండే స్పెషల్

సాక్షి, నాగర్‌కర్నూల్: పచ్చని నల్లమల కొండల నుంచి నీలం రంగులో ప్రవహించే కృష్ణానది పరవళ్లు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్‌లోని కృష్ణాతీరంలోని సుందరమైన ప్రదేశాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని కృష్ణాతీరంలోని సోమశిల ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. వీకెండ్ రోజుల్లో సోమశిల, అమరగిరి, మంచాలకట్ట ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్టూడెంట్స్, ఫ్రెండ్స్ గ్రూపులుగా ఏర్పడి ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సోమశిలకు వస్తున్న పర్యాటకుల సౌకర్యం కోసం ప్రభుత్వం కృష్ణానది తీరంలో కాటేజీలను ఏర్పాటుచేసింది. వీటి నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఈ కాటేజీల్లో వసతి, భోజనం, స్విమ్మింగ్ పూల్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు సోమశిల గ్రామంలో పదుల సంఖ్యలో ప్రైవేటు రిసార్ట్‌లు, కాటేజీలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం శని, ఆదివారాల్లో ఇవన్నీ పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. కృష్ణానదిలో విహరించేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో లాంచీ నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి 200 కి.మీ. దూరంలో సోమశిల ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో సోమశిల సమీపంలో ఎకో పార్కును నిర్మించగా, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. నల్లమల అడవి, సఫారీ, కృష్ణాతీరంలోని అందాలను ఒకేసారి ఆస్వాదించేలా సరికొత్త ఎకోటూరిజం టూర్ ప్లాన్‌ను అటవీశాఖ రూపొందించింది. త్వరలోనే ఈ తరహా టూర్ ప్లాన్‌ను అమలుచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నల్లమలలో టైగర్ స్టే ప్యాకేజీ..

నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ.. అడవిలోని పులులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసేందుకు టైగర్ సఫారీ అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులుల సంతానోత్పత్తికి అనుకూలం కావడంతో ఈ మూడు నెలల పాటు సఫారీ నిలిపివేస్తారు. మిగతా రోజుల్లో నిత్యం టైగర్ సఫారీ పర్యాటకులకు అందుబాటులో ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి నల్లమలలో టైగర్ సఫారీని అధికారులు పునప్రారంభించారు. ప్రకృతి ప్రేమికులు, అడవిలో ఒకరోజు పాటు పూర్తిగా గడపాలనుకునేవారికి అటవీశాఖ 'టైగర్ స్టే ప్యాకేజీ'ని అందుబాటులోకి తెచ్చింది. ఉదయం పూట అడవిలో పక్షుల సందడి, వాటి కిలకిలరావాలను ఆస్వాదిస్తూ ట్రెక్కింగ్, టైగర్ సఫారీ, వసతి సౌకర్యాలను కల్పిస్తోంది. దట్టమైన అడవిలో సుమారు 20 కి.మీ. దూరం టైగర్ సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ వన్యప్రాణులు, అడవి అందాలను వీక్షించవచ్చు. నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో టైగర్ సఫారీ కోసం హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై ఉన్న ఫర్హాబాద్ గేటు వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ ఫర్హాబాద్ వ్యూపాయింట్ వద్దకు చేరుకోవచ్చు. వీకెండ్ సమయాల్లో శ్రీశైలం వెళ్లే ప్రయాణికులతో టైగర్ సఫారీకి రద్దీ పెరుగుతోంది. ఇదే దారిలో వటవర్లపల్లి సమీపంలో మల్లెలతీర్థం జలపాతం, ఆక్టోపస్ వ్యూపాయింట్ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. టైగర్ స్టే ప్యాకేజీ వివరాల కోసం "amrabadtigerreserve.com'లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.



నల్లమల అటవీ ప్రాంతం



రోజంతా అడవిని ఆస్వాదించేలా ప్యాకేజీలు..



నల్లమలలో 24 గంటల పాటు ఉండి రోజంతా అడవి అందాలను ఆస్వాదించాలనుకునే వారి కోసం టైగర్ స్టే ప్యాకేజీలను రూపొందించాం. ట్రెక్కింగ్, టైగర్ సఫారీ, స్టే చేసేలా ప్యాకేజీ అందిస్తున్నాం. స్థానిక చెంచులనే గైడ్‌లు నియమిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ

అందుబాటులో హోం ఫుడ్..

సోమశిలకు వస్తున్న పర్యాటకులకు స్థానికుల ద్వారా హోం ఫుడ్ లభిస్తోంది. ఇక్కడ లభ్యమయ్యే తాజా చేపలతో చేసిన వంటకాలను తక్కువ ధరలకే అందిస్తూ స్థానికులు ఉపాధి పొందుతున్నారు. నదిలో బోటు ద్వారా విహరించేందుకు ప్రైవేటు బోట్లు అందుబాటులో ఉంటాయి. కోవిడ్ అనంతర కాలం నుంచి ఇక్కడికి వస్తున్న పర్యాటకుల సంఖ్య పెరిగింది. సోమశిలతో పాటు కృష్ణాతీరంలోని అమరగిరి, మంచాలకట్ట ప్రాంతాల్లోనూ సుందరమైన దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటాయి. అయితే సోమశిల వద్ద మాత్రమే పర్యాటకులకు కాటేజీల వసతి సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో వాక్-ఇన్ స్పాట్ అడ్మిషన్లు

వనపర్తిటౌన్: ఐటీఐలో ప్రవేశాలకు ముందు జరిగిన విడతల్లో సీటు దక్కని విద్యార్థులు వాక్-ఇన్ స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని వనపర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తవారైతే ఆన్‌లైన్‌లో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని.. ఇందులో ఏదైనా ఒక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలని ఎంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతో పాటు ఒరిజినల్ ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావాలన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి : డీఈఓ



వనపర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ గోవిందరాజులు కోరారు. శనివారం పెబ్బేరు మండలం యాపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండటంతో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్న దాత నరేందర్‌రెడ్డి, ఆయన కుమారుడు శ్రీహరిరెడ్డిని అభినందించారు. గ్రామీణ పాఠశాలలను తీర్చిదిద్దడంలో స్థానిక ప్రజల సహకారం ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని.. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సరస్వతీమాత విగ్రహ ఏర్పాటుకు డీఈఓ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు మైనుద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌శర్మ, స్వరాజ్యం, బాబురెడ్డి, చైర్మన్ జయమ్మ, బాలమ్మ, ఇందిర, రమేష్, ఆంజనేయులు, కవిత, శివాని గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా అధికారులు

వనపర్తి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతి తక్కువ ప్రీమియంతో వర్తించే బీమా పథకాలను అర్హులందరికీ వర్తింపజేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై మాట్లాడుతూ.. 2018–19లో మంజూరైన 58 రాయితీ రుణాల గ్రౌండింగ్ చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి 80 శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా ట్రైకార్(ట్రైబల్ కార్పొరేషన్) రుణాలు ఇస్తుందని.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల గ్రౌండింగ్ పూర్తి చేయించాలన్నారు.

పీఎంఈజీపీ రుణాలివ్వాలి..

ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని.. సేవ, పారిశ్రామిక రంగాల్లో రాణించేందుకు ఆసక్తి చూపే యువత ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారికి 35 శాతం వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఇందుకోసం జిల్లా ఇండస్ట్రీస్ అధికారి నగేశ్ (సెల్‌నంబర్ 83329 04444) సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, గిరిజనశాఖ అధికారి సుషిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశిల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్.. హాజరైన అధికారులు

వనపర్తి: బాల్య వివాహాలను నియంత్రించడంలో గ్రామ, మండలస్థాయి కమిటీల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని.. ప్రతి గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, మండలస్థాయిలో మండల చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కమిటీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి పెళ్లిళ్లు జరిపే మతపెద్దలకు కూడా సూచనలు చేయాలన్నారు. అక్టోబర్ చివరి వారాన్ని 'చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ వీక్'గా గుర్తించి ఆయా కమిటీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలల సంరక్షణకు హెల్ప్‌లైన్ నంబర్ 1098పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయి, డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సుషిత, డీపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

30 వేల సభ్యత్వాలే లక్ష్యం : బీజేపీ

వనపర్తిటౌన్: ప్రధాని మోదీ నిర్ణయాలతో సభ్యత్వ నమోదుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ వేముల నరేందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాపార్క్ చౌరస్తాలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తండాల నుంచి మొదలు పట్టణాల వరకు.. మహిళల నుంచి రైతుల వరకు సభ్యత్వాలు పొందుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 15 వేల సభ్యత్వాలు నమోదయ్యాయని.. త్వరలోనే 30 వేలకు చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణ, లాల్‌సింగ్, లాల్యానాయక్, శంకర్‌నాయక్, లింగేశ్వర్ పాల్గొన్నారు.

చెరుకుకు మద్దతు ధర పెంచాలి



డీజీఎం మురళికి వినతిపత్రం అందజేస్తున్న చెరుకు రైతులు

అమరచింత: పెరిగిన ధరలకు అనుగుణంగా చెరుకు పంటకు మద్దతు ధర పెంచాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. శనివారం కొత్తకోటలో జరిగిన ఉమ్మడి జిల్లా చెరుకు రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల ధరలు, కోత కార్మికుల కూలి పెరగడంతో పెట్టుబడి అధికమవుతుందని.. మద్దతు ధర పెంచకుండా రికవరీ ప్రకారం చెల్లిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధర పెంచకపోవడంతో ఏటా చెరుకు సాగు తగ్గుతోందని.. ఫ్యాక్టరీ ప్రారంభంలో 16,900 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 5,800 ఎకరాలకు పడిపోయిందని తెలిపారు. సాగునీరు సమృద్ధిగా అందడంతో పాటు ప్రభుత్వం సన్నరకం వరి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు వరిసాగుపై దృష్టి సారిస్తున్నారని వివరించారు. రికవరీతో సంబంధం లేకుండా టన్ను చెరుకుకు రూ.3,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. వేరు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని, అధిక దిగుబడులు వచ్చే కొత్త వంగడాలను అందించి అవగాహన కల్పించాలని కోరారు. సకాలంలో కోత కార్మికులను రప్పించాలని, పంట ఫ్యాక్టరీకి తరలించే బాధ్యతను యాజమాన్యం తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రాన్ని డీజీఎం మురళి, ఏజీఎం పాండురంగారావుకు అందజేశారు. కార్యక్రమంలో చెరుకు రైతు సంఘం నాయకులు వాసారెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, సీహెచ్ రామచందర్, శివుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, జింక రవి, నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఎస్‌బీఐ చైర్మన్ రాక

- మహిళా సంఘాలు, చేనేత కార్మికులకు రుణాలు అందజేత
- సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



చల్లా శ్రీనివాస్‌శెట్టి

వనపర్తి: బ్యాంకింగ్ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగినా.. పుట్టి పెరిగిన ప్రాంతంపై ఉన్న మమకారంతో ఎస్‌బీఐ చైర్మన్ హోదాలో తొలిసారిగా ఆదివారం జిల్లాకు రానున్నారు చల్లా శ్రీనివాస్‌శెట్టి. జిల్లా కేంద్రంలో కుటుంబ సభ్యులను కలవడంతో పాటు బ్యాంకర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు సైకిళ్లు, మహిళలు, విశ్వకర్మలు, చేనేత కార్మికులకు రుణాలు అందజేయనున్నారు.

■ ఇదిలా ఉండగా ఈయన ఎస్‌బీఐ డైరెక్టర్ హోదాలో ఉన్నప్పుడు జిల్లాకేంద్రంలోని బ్యాంకులో ప్రత్యేకంగా రుణ విభాగాన్ని ప్రారంభించారు. హైదరాబాద్, బెంగుళూరులాంటి మెట్రో సిటీల్లో ఉండే ఈ కేంద్రాన్ని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయించడంతో స్థానిక వ్యాపారాలు, గృహ నిర్మాణదారులు సులభంగా రుణం తీసుకునే వెసులుబాటు కల్పించినట్లయిందని చెప్పవచ్చు.

■ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్దపోతలపాడులో ఆయన జన్మించినా.. తల్లిదండ్రులు జీవనోపాధికి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిళ్లకు వచ్చి స్థిరపడ్డారు. పేద కుటుంబంలో జన్మించిన ఆయన బ్యాంకింగ్ రంగంలో నిబద్ధతతో పని చేస్తూ అత్యున్నతస్థాయికి ఎదగడం పుట్టిన గద్వాల, పెరిగిన వనపర్తి జిల్లాకు గర్వకారణమని బంధువులు, మిత్రులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు ఇప్పటికే మధ్యతరగతి జీవనం గడుపుతుండటం.. వారిని తన వద్దకు రప్పించుకొని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయొద్దనే భావనతో ఆయనే ముంబై నుంచి ఒకరోజు కుటుంబ సభ్యులతో కలిసి గడిపేందుకు వనపర్తికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన రాక విషయం తెలుసుకొని పలువురు బ్యాంకర్లు సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. పలువురు ప్రజాప్రతినిధులు సైతం ఆయనను కలిసి వనపర్తి ప్రాంత అభివృద్ధిపై చర్చించేందుకు అనుమతి కోరడంతో కార్యక్రమంలో పలుమార్పులు చేసినట్లు సమాచారం. ఆదివారం ఉదయం పాత మార్కెట్‌యార్డులోని గణేశ్ ఆలయంలో జరిగే హోమంలో పాల్గొంటారు. అనంతరం పలు సామాజిక కార్యక్రమాలు, ప్రజాప్రతినిధులను కలిసేలా షెడ్యూల్ రూపొందించారు. ఆయన పర్యటనను అధికారికంగా ఎవరూ ధ్రువీకరించడం లేదు.

■ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆయన్ను కలిసి కోరనున్నట్లు తెలుస్తోంది.

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

వనపర్తి: నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షపడినప్పుడే నేరాలు తగ్గుముఖం పడుతాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. కేసుల విచారణ సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు సత్వరం పరిష్కరించాలని సూచించారు. పోలీసులు, న్యాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టడానికి పరోక్షంగా సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సీఐ రవిపాల్, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం ఎస్‌ఐలు మంజునాథ్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ, డీసీఆర్‌బీ ఎస్‌ఐ రవిప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ సంజీవయ్య, మురళీకృష్ణ, రాంగోపాల్‌వర్మ, స్వామి పాల్గొన్నారు.

- పోలీస్‌శాఖ గౌరవం, ప్రతిష్ట పెంచేలా వాహనాల నిర్వహణ ఉండాలని ఎస్పీ గిరిధర్ సూచించారు. శనివారం ఎంటీ విభాగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు వాహనాల తనిఖీ, డ్రైవర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వాహనాల నిర్వహణ సక్రమంగా చేసిన ఎస్.శివకుమార్‌గౌడ్, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్‌కు రివార్డులు అందించారు. ఏఎస్పీ రాందాస్ తేజావత్, ఏఆర్ అదనపు డీఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం

రాజాపూర్: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన అంజనేయులు(38) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. అతని భార్య ఉషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి


బోయపాటి స్వాతి(ఫైల్)

మద్దూరు: అనుమానాస్పద స్థితిలో ఏడు నెలల గర్భిణి మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాంలాల్ కథనం మేరకు.. బోనపాటి స్వాతి(23), ఇదే గ్రామానికి చెందిన కాశప్పను నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి బాబు పుట్టాడు. ప్రస్తుతం ఆమె 7 నెలల గర్భిణి. ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి ఎఫ్ఎస్ఎల్(ఫోరెన్సిక్ సైన్స్ లాబోరెటరీ) రిపోర్టు తర్వాత తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు. కావలి రాములు తన కూతురి మరణంపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలంలో పురుగు మందు పిచికారీ..

- అస్వస్థతతో రైతు మృతి

పాన్‌గల్: వ్యవసాయ పొలంలో పురుగు మందు పిచికారీ చేసిన రైతు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన పాన్‌గల్ మండలం జమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. జమ్మాపూర్‌కు చెందిన రాచూరి నాగయ్య(48) గ్రామంలోని చికోకండ్ల అంజయ్య పొలంలో ఈనెల 18న పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మందు పిచికారీ అనంతరం ఇంటికి వచ్చి స్నానం చేసిన ఆయన.. అకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించా రు. అక్కడి నుంచి పాలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ క్రైం: భర్తను హత్య చేసిన కేసులో భార్యతో పాటు మరో వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం జానంపేట గ్రామానికి చెందిన పాటిమిడి చిన్నరాజు (36), పాటిమిడి లలిత అలియాస్ రాధ భార్యాభర్తలు. 2019 ఏప్రిల్ 26న కురుమూర్తి సమీపంలో భార్య రాధ మరో యువకుడు మధుగాని కురుమూర్తి కలిసి చిన్నరాజుకు చిన్నరాజుకు మద్యం తాగించి టవల్‌తో మెడకు బిగించి హత్య చేశారు. 2019 ఏప్రిల్ 30న కేసు నమోదు చేసిన సీసీ కుంట పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు శనివారం ఫ్యామిలీ కోర్టు రాగా మూడో అదనపు, జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఆర్ శ్రీదేవి వాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో ముద్దాయిలు అయిన ఏ1 పాటిమిడి లలిత అలియాస్ రాధ, మధుగాని కురుమూర్తిలను దోషులుగా నిర్ధారిస్తూ ఇద్దరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడేవిధంగా కృషి చేసిన పీపీలను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

41 రోజుల్లో సమస్య పరిష్కారం

- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావు


వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావు

జడ్చర్ల టౌన్: విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసిన 41 రోజుల్లో పరిష్కరిస్తున్నట్లు వినియోగదారుల ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని విద్యుత్ డీఈ కార్యాలయంలో నిర్వహించిన వినియోగదారుల ఫోరం సమావేశంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఏప్రిల్ 1నుంచి అక్టోబర్ 15వ తేదీ నాటికి 250 ఫిర్యాదులు అందగా.. 240 పైగా పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగతా ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల ఫోరానికి వచ్చే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా 41 రోజుల్లోగా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారుడు వ్యక్తిగత సమస్యలతో పాటు అన్ని విద్యుత్ సమస్యలను ఫోరానికి నేరుగా లేదా ఆన్‌లైన్, పోస్టు కార్డు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్రంలో మొత్తం 11 విద్యుత్ సర్కిళ్లు ఉన్నాయని.. ప్రతినెలా ఏదో ఒక సర్కిల్‌లో మూడు చోట్ల ఫోరం వేదికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూడునెలల బిల్లులు చెల్లించనవసరం లేదు..

గృహజ్యోతి పథకానికి అర్హత పొందిన విద్యుత్ వినియోగదారులు మార్చి, ఏప్రిల్, మే నెలల బిల్లులు చెల్లించనవసరం లేదని ఎస్ఈ రమేష్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గృహజ్యోతి పథకం ఆలస్యంగా అమల్లోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కారణంగా పై మూడు నెలలకు సంబంధించి బిల్లులు వచ్చాయన్నారు. ఆ బిల్లులను చెల్లించాలని విద్యుత్ సిబ్బంది వినియోగదారులపై ఒత్తిడి తీసుకువస్తున్న విషయాన్ని పలువురు ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా.. పై విధంగా స్పందించారు. ఎవరైనా వినియోగదారుడు బిల్లు చెల్లిస్తే, రిటర్న్ చేస్తామన్నారు. అయితే ఆయా మూడు నెలల్లో 200 యూనిట్లు దాటిన వారు మాత్రం బిల్లు చెల్లించాల్సిందేనని అన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1.26 లక్షల మందికి గృహజ్యోతి పథకం ద్వారా జీరో బిల్లులు వస్తున్నాయన్నారు. మొదటి దఫాలోనే 98వేల మందికి పథకం అమలు కాగా.. తర్వాత మరో 28వేల మందికి అమలవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జడ్చర్లలో నిర్వహించిన వినియోగదారుల ఫోరం సమావేశంలో 19 ఫిర్యాదులు అందినట్లు డీఈ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు రామాంజ నాయక్, నాగేశ్వర్, వెంకట్, ఏడీఈ చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో పాలమూరు సత్తా



ఓవరాల్ రన్నరఫ్ ట్రోఫీని అందుకుంటున్న అదనపు ఎస్పీ రాములు, కానిస్టేబుల్స్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్

- సిల్వర్ మెడల్స్ సాధించిన కానిస్టేబుల్స్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ రన్నర్ అఫ్ ట్రోఫీని జోగుళాంబ జోన్‌-7 దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మొదటిసారిగా నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ రన్నర్ అఫ్ ట్రోఫీని కైవసం చేసుకోవం జరిగింది. హైదరాబాద్‌లోని టీఎస్‌పీఏలో శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, ఇతర పోలీస్ ఉన్నతాధికారుల నుంచి జోనల్ నోడల్ అధికారి రాములు ట్రోఫీతో పాటు విజేతలుగా నిలిచిన వారు రివార్డులు అందుకున్నారు. వీడియోగ్రఫీ విభాగంలో మహబూబ్‌నగర్ నుంచి కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డికి సిల్వర్ మెడల్ దక్కగా, నారాయణపేట జిల్లా నుంచి ఏఆర్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్‌కు యాంటి సబోటేజ్ చెక్ విభాగంలో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా జోగుళాంబ జోన్‌-7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగుళాంబ జోన్‌-7నుంచి పోటీ చేసి ఓవరాల్ రన్నర్ అఫ్ ట్రోఫీ రావడానికి కృషి చేసిన కానిస్టేబుల్స్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్‌లను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీలు డి.జానకి, ఎస్పీ యోగేష్ గౌతమ్‌లు వారిని ప్రత్యేకంగా అభినందించారు.


సీఎం చేతులమీదుగా ట్రోఫీ అందుకుంటున్న పోలేపల్లి వాసి రాజశేఖర్

పోలీస్ ఫొటోగ్రఫీలో పోలేపల్లి వాసికి బహుమతి..

జడ్చర్ల టౌన్: పోలేపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఫొటోగ్రఫీ విభాగంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. సిటీపోలీస్ శిక్షణ విభాగంలో పనిచేస్తున్న రాజశేఖర్ శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ద్వారా ప్రశంసాపత్రం, మెడల్ సైతం అందుకున్నారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి అంతర్‌జిల్లాల్లో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్‌-14, అండర్‌-17 విభాగాల ఆర్చరీ బాలబాలికలు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను శారదాబాయి ప్రారంభించి మాట్లాడుతూ ఆర్చరీ క్రీడలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులకు త్వరలో రాష్ట్రస్థాయి ఆర్చరీ ఎంపికలకు పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

అండర్‌- 14 విభాగం ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో దేవాన్ష్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శివశంకర్, శివకుమార్, దేవిరామ్, బాలికల్లో సమీక్ష, దీక్షిత, కంపౌండ్‌లో చరణ్‌గౌతంరెడ్డి, మనీశ్వర్‌సాయి, బాలికల్లో సాయి సమీక్ష, కె.శివాని ఆయేషా సిద్దిఖా ఎంపికయ్యారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్‌-14, అండర్‌-17 విభాగాల బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపా ల్, జగన్‌మోహన్‌గౌడ్‌తోపాటు కరాటే మాస్టర్లు జి.కృష్ణయ్య, జహంగీర్‌పాషఖాద్రీ, శంకర్‌నాయక్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- చిన్నారులపై దాడి
- పలువురికి గాయాలు, జిల్లా ఆస్పత్రికి తరలింపు


గాయపడిన కావేరి..


గాయపడిన నందిని

కోస్గి: గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ చిన్నపెద్ద తేడా లేకుండా పలువురిపై దాడి చేసింది. గాయపరిచిన వారిలో ముగ్గురు పాఠశాల విద్యార్థులు ఉన్నారు. ఈ సంఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గరకు వెళ్తున్న శ్రావణిని పిచ్చికుక్క కరిచింది. దీంతో ఆమె గట్టిగా అరవడంతో అక్కడే ఉన్న కొందరు గ్రామస్తులు కుక్కను వెంబడించారు. అక్కడి నుంచి ఎస్సీ కాలనీలోకి వెళ్లి వికలాంగురాలు రామమ్మను విచక్షణ రహితంగా కుక్కదాడి చేసింది. అక్కడి నుంచి పాఠశాలకు వెళ్తున్న 5వ తరగతి బాబు, కావేరిలతో పాటు 1వ తరగతి నందినిపై కుక్క దాడి చేసింది. అనంతరం బీసీ కాలనీలో యువతిపై దాడి చేసింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే చిన్నారులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిలో కావేరి, నందినిలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు గుంపుగా కుక్కను గాలించి కర్రలతో కొట్టి చంపేశారు. కుక్కల బెడదపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటన చోటు చేసుకుందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో పెరుగుతున్న నేరప్రవృత్తి

- మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలు వినియోగించే వ్యక్తులతో నేరప్రవృత్తి పెరుగుతుందని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సెల్, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చెడ్డవారితో స్నేహం చెడు వ్యసనాలకు దారి తీస్తుందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్‌పై దృష్టిసారించి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. మత్తుకు బానిసైన వారిని రిహాబిలిటేషన్ కేంద్రాలకు తరలించి మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంతో యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని.. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాఠశాలల్లోని చిన్న పిల్లలకు సైతం చాక్‌లేట్ రూపంలో అందిస్తున్నారని.. దీంతో కేంద్ర నాడీ వ్యవస్థ అచేతనంగా మారుతుందని, వాటి వినియోగం, సరఫరా చట్టవ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, పీయూ ఎన్ఎస్ఎస్ సెల్ కో-ఆర్డినేటర్ ప్రవీణ, ప్రిన్సిపాల్స్ నూర్జహాన్, బషీర్ అహ్మద్, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, అధ్యాపకులు కుమారస్వామి, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూరాల 20 గేట్ల ద్వారా నీటి విడుదల

- ప్రాజెక్టులకు 1.14లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


జూరాల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

ధరూరు/ఆత్మకూరు: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మళ్లీ వరద ప్రారంభమైన వరద శనివారం మరింత పెరిగింది. శనివారం రాత్రి 1.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దీంతో ప్రాజెక్టు 20 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 35,524 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. గేట్ల ద్వారా 82,940 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 48 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 1,20,163 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 285.180 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 265.609 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 550.789 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

150 ఏళ్ల మర్రిచెట్టు.. కూలిపోయింది


న్యూటౌన్‌లోని టీవీ రిలే స్టేషన్ సమీపంలో కూకటివేళ్లతో సహా కూలిపోయిన మర్రి చెట్టు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూటౌన్ ప్రాంతంలోని టీవీ రిలే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న సుమారు 150 ఏళ్ల మర్రి చెట్టు ఒక్కసారిగా శనివారం మధ్యాహ్నం కూలిపోయింది. బీటీరోడ్డు పక్కనే ఉన్న టీటీడీ కల్యాణ మండపం కాంపౌండ్ వాల్‌పై కూకటివేళ్లతో సహా పడింది. దీంతో అక్కడి విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు తెగిపోయాయి. ఇది గమనించిన స్థానికులు, బాటసారులు వెంటనే మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన వారు అక్కడికి చేరుకుని వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి చెట్టుతో పాటు కొమ్మలను కొట్టించి వేరే చోటకు తరలించారు. అనంతరం కొత్త తీగలు బిగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా, ఒకవేళ ఈ చెట్టు నడిరోడ్డుపై పడి ఉంటే బాటసారులకు ప్రాణాపాయం కలిగేదని స్థానికులు తెలిపారు. త్రుటిలో ప్రమాదం తప్పిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస విశ్వవిద్యాలయం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం తమిళనాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు డాక్టరేట్ పట్టాను అందజేసి సత్కరించారు. మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి గెలుపొందినప్పటి నుంచి ప్రజాసేవా కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను స్వయంగా తన వాహనంలో ఆస్పత్రికి తరలించడంతో పాటు ఆర్థికసాయం అందిస్తూ.. అండగా నిలుస్తున్నారు. దాదాపు 34 సార్లు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా డాక్టరేట్‌ను ప్రదానం చేయడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్ కుమార్, కట్టా సురేష్, రవికుమార్, లక్ష్మణ్, నారాయణ, తాయప్ప, గద్వాల్ రవి, ఆంజనేయులు, అబ్దుల్ రహిమాన్, నూరుద్దీన్, వెంకట్‌రెడ్డి, రత్నకుమార్, నర్సింహులు, శేఖర్, మందుల నరేందర్, చెన్నయ్య, సాగర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ విజేత మహబూబ్‌నగర్


విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ బాలుర జట్టు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం 68వ పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్‌జీఎఫ్ అండర్‌-17 బాలబాలికల విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్లు విజేతలుగా నిలిచాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్‌-17 బాలికలు, బాలుర విభాగంలో పోటీలను నిర్వహించారు. ఇందులో బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టుకు మొదటి బహుమతి, నాగర్‌కర్నూల్ జట్టుకు రెండో బహుమతి, గద్వాల జట్టుకు మూడో బహుమతి లభించింది. అదేవిధంగా బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టుకు మొదటి బహుమతి, గద్వాల జట్టుకు రెండో బహుమతి, నారాయణపేట జట్టుకు మూడో బహుమతి లభించాయి. విజేలతకు బహుమతులను అందజేశారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టును అధికారులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శారదాబాయి, పాండు, జేపీఎన్ఈసీ చైర్మన్ రవికుమార్, మాజీ జెడ్పీటీసీ బాలనర్సిములు, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, నిరంజన్, వడెన్న, వేణుగోపాల్, పరుషరాములు, గణేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలన్నీ మానుఫ్యాక్చరింగ్‌పైనే ఆధారం


మాట్లాడుతున్న ఏటీసీ స్పెషల్ ఆఫీసర్ సీతారాములు

మన్ననూర్: రానున్న కాలంలో పరిశ్రమలు ప్రధాన పాత్ర పోషిస్తాయని.. వ్యవస్థలన్నీ మానుఫ్యాక్చరింగ్‌పైనే ఆధారపడతాయని ప్రభుత్వ ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, ఏటీసీ స్పెషల్ ఆఫీసర్ సీతారాములు అన్నారు. మన్ననూర్ ఆర్ఐటీఐని అప్‌గ్రేడ్ చేస్తూ.. నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్వహణ విధి విధానాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత మానవ సమాజం కొత్త టెక్నాలజీని నమ్ముకుంటుందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ఏటీసీ నిర్వహణకు అయ్యే ఖర్చులో స్థానిక ఆర్ఐటీఐ 4 శాతం భరిస్తే.. మిగతా ఖర్చు మొత్తం కూడా సీఎస్ఆర్ భరిస్తుందన్నారు. సీఎస్ఆర్ వారు ఏటీసీ నిర్వహణకు కావాల్సిన యంత్ర పరికరాలకు సుమారు రూ. 35 కోట్లు ఖర్చు చేస్తుండటంతో పాటు శిక్షకులు, ఇతర సిబ్బందిని నియమించే బాధ్యత తీసుకుంటుందన్నారు. ఏటీసీలో ఏడాదికి సంబంధించి 3 కోర్సులు, రెండేళ్లకు సంబంధించి 3 కోర్సులు టాటా కన్సల్టెన్సీతో ఉంటాయని తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పొందిన యువకులకు జాబ్ గ్యారంటీ ఉంటుందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని యువకులకు ఇది వరంలాంటిదని.. అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న డిసెంబర్ నాటికి ఏటీసీ నిర్వహణకు అవసరమైన పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉందని.. తొలి విడతలో 172 మందికి శిక్షణ ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు డిసెంబర్, జనవరిలో తరగతులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐటీఐల కన్వీనర్ జయమ్మ, ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి, ఉమర్ ఫారుఖ్, సుధాకర్, నసీర్ బాబా, కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, రహీం, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మేరాజ్, యశ్వంత్ పాల్గొన్నారు.